ప్రజాశక్తి

మంగళవారం 1 అక్టోబర్ 2024

వెయిట్ లిఫ్టింగ్‌కు 20 మంది ఎంపిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు 20మంది క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి చల్లా రాము తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 13 వరకు హిమచల్ ప్రదేశ్ నగర్త భగవాన్ రైన్‌బో ఇంటర్ నేషనల్ స్కూల్‌లో సీనియర్, జూనియర్ సబ్ జూనియర్, మహిళా, పురుష విభాగాల్లో వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరుగుతాయని, ఈ పోటీలకు జిల్లా తరపున 13మంది అమ్మాయిలు, 7గురు అబ్బాయిలు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన వారు రోజు వారి ఖర్చులు వారే భరించాల్సి ఉంటుందని తెలిపారు. కాగా గతంలో క్రీడాకారులు ఖర్చు జాతీయ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ భరించేదని ప్రస్తుతం క్రీడాకారుల ఖర్చు అశోసియేషన్ బరించలేదని రాము తెలిపారు.

విద్యార్థి పండగ.. మది నిండుగ

- చైతన్యం నింపిన భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్
- ఆకట్టుకున్న తప్పెటగుళ్లు, కోలాటం, రేలా రేలా
- భగత్ సింగ్, గాంధీ స్ఫూర్తితో ఉపాధి కోసం, డ్రగ్స్ నిర్మూలనకు ఉద్యమిద్దాం
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

శ్రీను డప్పు ప్రదర్శన

జానపద కళాకారుడు జానకిరామ్ హుషారైన జానపద గీతాలకు డప్పు శ్రీను బృందం డప్పుపై దరువేస్తూ ఆడుతుంటే..?
గుండె ఝుల్లుమనేలా శంకరరావు బృందం తప్పెటగుళ్లు వాయిస్తుంటే?
శృంగవరపుకోట విద్యార్థినులు గిరిజన సంప్రదాయ నృత్యం థింసా ప్రదర్శనతో కట్టిపడేస్తుంటే?
చూడచక్కగా చీపురుపల్లి, గొల్లపల్లి విద్యార్థినులు కోలాటం ఆడుతుంటే?
హుషారైన సినిమా పాటలకు విద్యార్థులు స్టేజి దద్దరిల్లేలా స్టెప్పులేస్తుంటే?

...ఇంకేముంది కన్నుల పండగే. ఇలాంటి అద్భుత ప్రదర్శనలు చూడటానికి రెండు కళ్లూ సరిపోవు. అంతకు మించిన ఆనందం, వినోదం మరోచోట దొరకదు. అందుకే అలాంటి వినోదాన్ని విద్యార్థులకు, యువతకు పంచడమే లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ.. భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్‌ను ఏర్పాటు చేసింది. డ్రగ్స్ నిర్మూలనే ధ్యేయంగా, వినోదం, విజ్ఞానంతోనే అసలైన ఆనందమంటూ మూడు రోజులపాటు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వైజ్ఞానిక ప్రదర్శన, మ్యాజిక్‌షో.. ఆహూతులను ఉర్రూతలూగించాయి.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాజంలో యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకుంటున్న నేపథ్యంలో మత్తు పదార్థాలతోనే ఆనందం కాదు విజ్ఞానం, వినోదంతో అసలైన ఆనందం.. అంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన స్థానిక గురజాడ కళాభారతి ఆవరణలో నిర్వహించిన భగత్‌సింగ్ ఫెస్ట్ విద్యార్థులను, యువతను చైతన్యపర్చింది. మూడు రోజులు పాటు జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి కళాశాలలు, పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు పాల్గొని ఆట పాటలతో అలరించారు. డ్రగ్స్, గంజాయి వల్ల కలిగి నష్టాలను నృత్యరూపకంలోను, ఆట పాటల్లోను వివరించారు. సమాజంలో మన బాధ్యత ఏమిటి, భావి భారత పౌరులుగా మన కర్తవ్యాలు ఏమిటి అనే విషయాలు చెబుతూ పాటలు ద్వారా, కోలాటం, డప్పు వాయిద్యాలతో, రేలా రేలా కార్యక్రమం ద్వారా అభ్యుదయ గీతాలు ఆలపించి ప్రజలను ఆలోచింప చేశారు. ప్రధానంగా తప్పెట గుళ్లతో శంకరరావు మద్యం, గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దంటూ తన బృందంతో ఆడి, పాడి వివరించారు. రేలా రేలా కార్యక్రమం ద్వారా జానకిరామ్ బృందం దేశభక్తి గీతాలు, మన జానపద గీతాలు ఆలపించి అందులో ఉండే ఆనందాన్ని వివరించారు.

ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు

భగత్ సింగ్, గాంధీ స్ఫూర్తితో ఉద్యమిద్దాం

స్వాతంత్ర్య పోరాట యోధులైన గాంధీజీ, భగత్ సింగ్ చరిత్ర తెలియకుండా చేసేందుకు పాఠ్యాంశాల నుంచి తొలగిస్తున్న నేటి తరుణంలో వారు అందించిన పోరాట స్ఫూర్తితో ఉపాధి అవకాశాలు కోసం, నిరుద్యోగ యువతను డ్రగ్స్ నుంచి దూరం చేసే విధంగా పోరాటాలు నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ పిలుపునిచ్చారు. ఫెస్ట్ చివరి రోజు ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి కల్పించడంలో విఫలమవుతున్నాయని అన్నారు. ఉపాధి అవకాశాలు లేక పని దొరక్కా యువత చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారన్నారు. డ్రగ్స్, గంజాయి మాఫీయాలు ఎక్కువయ్యాయన్నారు. వీటిని నిర్మూలించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. నేడు యువత డ్రగ్స్ గంజాయి వంటి వాటికి బానిస కాకుండా విజ్ఞానం, వినోదంతో మంచి ఆనందం ఉందనే ప్రయత్నంలో భాగంగా ఫెస్ట్ కార్యక్రమాలు రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఎస్ఎఫ్ఐ నిర్వహిస్తోందన్నారు. రానున్న కాలంలో ఎస్ ఎఫ్ఐ నిర్వహించే పోరాట కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఎస్ ఎఫ్ ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా యువత శాస్త్రీయ ఆలోచన వైపు వెళ్లే విధంగా నేడు సమాజంలో డ్రగ్స్,గంజాయి భారిన పడకుండా భగత్‌సింగ్ ఫెస్ట్ నిర్వహించామన్నారు. ఫెస్ట్ నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు ఎస్ ఎఫ్ ఐ నిర్వహించే కార్యక్రమాల్లో భాగస్వాములై ఆరోగ్య కరమైన సమాజం కోసం ముందుకు రావాలని కోరారు. మూడు రోజులు పాటు జరిగిన ఫెస్ట్ కార్యక్రమాన్ని తిలకించేందుకు వందల సంఖ్యలో విద్యార్థులు, ప్రజలు హాజరయ్యారు.

తప్పెటగుళ్లు వాయిస్తున్న పూసపాటిరేగకు చెందిన శంకరరావు బృందం

చరిత్రకారులను మరువద్దు.. అంటూ వారి త్యాగాలను గుర్తిస్తూ ఎస్.కోట విద్యార్థినులు నృత్య పదర్శన

కోలాటం ఆడుతున్న బొబ్బిలి విద్యార్థినులు

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

సమాన పనికి సమాన వేతనమివ్వాలి

ధర్నాలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. ఆలిండియా డిమాండ్స్‌డే సందర్భంగా సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, కంటెంజెంట్, టైంస్కేల్ తదితర పేర్లతో పని చేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలలోనూ ఆర్టీసి, విద్యుత్తు, మున్సిపల్ కార్పొరేషన్ వంటి సంస్థలలో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత, సెలవులు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు. గతంలో ఐదేళ్లుఏదైనా ఒక సంస్థలో పని చేస్తే ప్రభుత్వం వారిని రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చేదని, కానీ నేడు జాయినింగ్ దగ్గర నుంచి రిటైర్మెంట్ అయ్యే వరకు పనిచేసినా పర్మినెంట్ చేయకపోవడం అన్యాయమని అన్నారు. గత ప్రభుత్వం ఆప్కాస్ ఏర్పాటు చేసిన తరువాత జీవితంలో పర్మినెంట్ అయ్యే అవకాశమే లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం శాశ్వత స్వభావం కలిగిన పనులు చేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలన్నారు. అప్పటివరకు పర్మినెంట్ వర్కర్ తో సమానంగా జీతాలు చెల్లించాలని, అలా చెల్లించని యాజమాన్యంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ధరల ప్రకారం కనీసం నెలకు రూ.26వేలకు తక్కువ లేకుండా చెల్లించాలని అన్నారు. ధర్నాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్, ఉపాధ్యక్షులు టి.వి.రమణ, జిల్లా కార్యదర్శులు ఎ.గౌరి నాయుడు, బి. సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షులు ఎ.జగన్మోహన్, సిహెచ్.ముత్యాలు, ఎ.సురేష్, మున్సిపల్, ఆర్టీసీ, స్టోర్ హమాలీ, హెచరిస్, బేవరేజెస్ తదితర రంగాల కార్మికులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

మద్యం షాపుల సిబ్బంది ధర్నా

సిఐటియు మద్దతు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ధర్నా చేస్తున్న మద్యం షాపుల సిబ్బంది

తమకు ఉద్యోగ భద్రత కల్పించి, కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ ఎపి బేవరేజ్ కార్పొరేషన్ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద మద్యం షాపుల సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి నాయకులు ఎస్.రామకృష్ణ, అర్.సాయికుమార్, కె.మురళీ, ఎస్ చిరంజీవి మాట్లాడుతూ నూతన మద్యం పాలసీతో రాష్ట్రంలో 15వేల మంది రోడ్డున పడతామని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యేలకు, మంత్రులకు, ఇతర ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చామన్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 7న రాష్ట్ర వ్యాప్తంగా బంద్ చేపట్టనున్నట్లు తెలిపారు. ధర్నాకు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరామమ్మ మద్దతు తెలిపారు. ధర్నాలో సిఐటియు నాయకులు ఎ.జగన్మోహనరావు, మద్యం షాపులు ఉద్యోగులు పాల్గొన్నారు.

రామభద్రపురం : మద్యం షాపుల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని మద్యం షాపు వర్కర్లు డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, సేల్స్‌మేన్‌లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

సిబిఎం స్కూల్ విక్రయంపై టిడిపి వైఖరేమిటి?

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని సిబిఎం స్కూల్ స్థలం విక్రయంపై అధికార టిడిపి వైఖరి ప్రకటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, సిపిఐ జిల్లా నాయకులు అప్పన్న డిమాండ్ చేశారు. సోమవారం సిబిఎల్ స్కూల్ వద్ద టిసిల కోసం వస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో వారు మాట్లాడారు. సిబిఎం స్కూల్ పిల్లల తల్లిదండ్రులకు రకరకాలుగా ప్రలోభాలు పెట్టి టిసిల కోసం స్కూల్ హెచ్ఎంపై ఒత్తిడి తేవడాన్ని వారు ఖండించారు. పట్టణానికి చెందిన వైసిపి కీలక నేత సిబిఎం స్కూల్ భూబదలాయింపు, కొనుగోలులో ఉన్నారని తెలిపారు. సుమారు రూ.100 కోట్ల విలువచేసే ఈ భూమిని ఆయన తీసుకొని, కోమటిపల్లిలో ఉన్న తన మూడు ఎకరాలకు పైగా భూమిని ఇస్తున్నానని ప్రకటించడం చాలా అన్యాయమన్నారు. ఈ స్థలం కొట్టేయాలనే ఉద్దేశంతో వైసిపి నాయకుడు, స్కూల్ కరస్పాండెంట్, కన్వీనర్ కలిసి విద్యా, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల అధికారుల సహకారంతో ఈ దుర్మార్గానికి ఒడిగట్టారని ధ్వజమెత్తారు. పిల్లల తల్లిదండ్రులను పంపించి టిసిలు ఇవ్వాలని ఒత్తిడి తెస్తే, ఆ వైసిపి నాయకుడి ఇంటి ముందే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మిద్దాం

సినీనటుడు సాయికుమార్

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రతిజ్ఞ చేయిస్తున్న సినీనటుడు సాయికుమార్, ఎస్‌పి జిందాల్, పోలీసు అధికారులు

డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని సినీనటుడు సాయికుమార్ పిలుపునిచ్చారు. పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం మాదకద్రవ్యాల నివారణకు బొబ్బిలి పట్టణంలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల నుంచి సూర్య రెసిడెన్సీ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని యువత, విద్యార్థులను కోరారు. ఒత్తిడిని ఎదుర్కొంటే మంచి భవిష్యత్తును పొందవచ్చని చెప్పారు. డబ్బింగ్ చెపుతూ మొదటి సంపాదన రూ.250 తీసుకుని తల్లికి ఇస్తే ఎంతో ఆనందం పొందినట్లు గుర్తుచేశారు. తెలిసో తెలియక చేసిన తప్పులను సరిదిద్దుకోవాలని కోరారు. దేశ రక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. సొసైటీని మంచి మార్గంలో నడిపించేందుకు సినిమా పాత్రల్లో నటిస్తున్నానని వెల్లడించారు.

ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ డ్రగ్స్‌పై సమాచారం కోసం కళాశాలలో డ్రాప్ బాక్స్ పెడతామని, డ్రగ్స్ వినియోగం, అమ్మకాలపై లిఖిత పూర్వకంగా అందులో వేయాలని కోరారు. డిఎస్‌పి పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గంజాయి తాగితే 6 నెలలు, రవాణా చేసినా, విక్రయించినా 10 నుంచి 20 ఏళ్ల వరకు జైలుశిక్ష పడుతుందని హెచ్చరించారు. అనంతరం డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని, మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మిస్తామని విద్యార్థులు, యువతతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో చీపురుపల్లి డిఎస్‌పి రాఘవులు, వాసు విద్యాసంస్థల కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు, తాండ్ర పాపారాయ కళాశాల కరస్పాండెంట్ తూముల కార్తీక్, సిఐలు బి.వెంకటరావు, కె.సతీష్‌కుమార్, ఎస్ఐలు జ్ఞానప్రసాద్, వి.ప్రసాద్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 221 వినతులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)కు 221 వినతులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్, డిఆర్ఒ ఎస్‌డి అనిత ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 221 అర్జీలు అందగా, భూ సమస్యలకు సంబంధించి రెవెన్యూ శాఖకు అత్యధికంగా 151, వినతులు అందాయి. పింఛన్లు మంజూరు చేయాలని తదితర అంశాలపై డిఆర్‌డిఎకు 18 వినతులు అందాయి. మున్సిపాలిటీకి 14 , పంచాయతీ శాఖకు 12, విద్యా శాఖకు 8 అందగా మిగిలినవి ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి. అనంతరం అధికారులనుద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల విభాగానికి వచ్చిన వినతులకు నాణ్యమైన, ఖచ్చితమైన సమాధానాలు ఇవ్వాలని చెప్పారు. వినతులు పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉంటే సహించేది లేదని స్పష్టం చేశారు.

3 నుంచి టెట్ పరీక్షలు

విజయనగరంటౌన్ : ఈ నెల 3 నుండి 21 వరకు టెట్ పరీక్షలు జిల్లాలో ఐదు కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. 22,889 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్లో టెట్ పరీక్ష ఏర్పాట్లపై సమావేశం నిర్వహించి పలు సూచనలను జారీ చేసారు. పరీక్షల పర్యవేక్షణ అధికారిగా విజయనగరం ఆర్‌డిఒని నియమిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థుల సందేహాల కోసం హెల్ప్ డెస్క్ 9849739920, 9493313271 , 9440941627 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

అభివృద్ధిని పరుగు పెట్టించడమే లక్ష్యం

స్వర్ణాంధ్ర-2047 దార్శనిక పత్రంపై ప్రజాభిప్రాయ సేకరణ ● విలువైన సూచనలు చేసిన ఎమ్మెల్యేలు, వివిధ వర్గాల ప్రజలు

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా వచ్చే ఐదేళ్లకు జిల్లా స్థాయి దార్శనిక పత్రం రూపకల్పన కోసం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో జిల్లాకు చెందిన పలువురు శాసనసభ్యులు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొని జిల్లా అభివద్ధిని వేగవంతం చేసి అభివద్ధి చెందిన జిల్లాగా రూపొందడానికి విలువైన సూచనలు అందజేశారు.

జిల్లా ఏయే రంగాల్లో అభివృద్ధి చెందేందుకు అవకాశం వుందో గుర్తించి ఆయా రంగాల్లో గల అవకాశాలను ప్రస్తావిస్తూ దార్శనిక పత్రం రూపొందిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. మండల స్థాయిలో ప్రజల అభిప్రాయాలు సేకరించి విజన్ ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ సదస్సులో ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు తెలియజేసిన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వానికి మరింత మెరుగైన రీతిలో నివేదిక రూపొందించి జిల్లా విజన్‌ను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ సమగ్రమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తేనే సత్వర ప్రగతి సాధ్యమవుతుందన్నారు. అంతర్జాతీయ విమానాశ్రమం ద్వారా పెద్ద ఎత్తున ఎగుమతులు చేయడానికి వీలుగా నాణ్యమైన అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను రూపొందించడంపై దష్టి సారించాల్సి వుందన్నారు. చిన్నపరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా అత్యధిక ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం వుంటుందన్నారు. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో రోడ్లు తదితర మౌళికవసతులు కల్పించడం ముఖ్యమని చెప్పారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు మాట్లాడుతూ నదుల అనుసంధానం ద్వారా జిల్లాలో సాగునీటిని అందించడంతో పాటు నగరానికి తాగునీటి కొరత కూడా తీర్చవచ్చని చెప్పారు. మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక శాతం మంది ఆధారపడివున్న వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టాల్సి వుందని చెప్పారు.

జిల్లాలో అందుబాటులో వున్న జలవనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం ద్వారా జిల్లాను అభివద్ధి బాట పట్టించవచ్చని ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షులు, ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ కె.రమేష్ నాయుడు సూచించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయడం ద్వారా వేలాది ఎకరాల సాగుభూములకు నీటిని అందించడం, భోగాపురం ఎయిర్‌పోర్టుకు అవసరమైన నీటిని సరఫరా చేయడం సాధ్యమవుతుందన్నారు. జిల్లాలో విద్యార్థుల అవసరాలకు తగినట్టుగా కళాశాలలు లేవని, వీటిని పెంచాల్సి వుందని చెప్పారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డిఆర్ఒ ఎస్.డి.అనిత తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక స్థలంగా విజయనగరం కోట

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

కోట పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నగరానికి చారిత్రక వారసత్వ సంపదగా వున్న కోటను సుందరీకరణ చేసి ఒక మంచి పర్యాటక స్థలంగా తీర్చిదిద్దనున్నట్టు జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. విజయనగర ఉత్సవాలలోపే సుందరీకరణ పనులు పూర్తిచేసి సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలసి కలెక్టర్ సోమవారం కోట వెలుపలి ప్రాంతాన్ని సందర్శించారు. కోట గోడ చుట్టూ సుందరీకరణకు చేయాల్సిన ఏర్పాట్లపై ఎమ్మెల్యే, అధికారులతో చర్చించారు. సుందరీకరణ పనులను అక్టోబరు 10వ తేదీ నాటికి పూర్తిచేసి ఉత్సవాల్లో సందర్శకులకోసం సిద్ధం చేయాలన్నారు. పనులు మంగళవారం నుంచే ప్రారంభం కావాలని స్పష్టంచేశారు. ఆర్‌డిఒ ప్రతిరోజూ పనులను పర్యవేక్షించాలన్నారు. కోట గోడపై అన్నివైపులా లైటింగ్ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. కోట చుట్టూ వున్న కందకాలను నీటితో నింపి లాన్‌తో అందంగా తీర్చిదిద్దాలన్నారు. కోట గోడను ఆనుకొని వెనకవైపు వున్న ఖాళీ స్థలంలో సందర్శకులు కూర్చొనేందుకు వీలుగా సీటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కోటకు దక్షిణ వైపున ప్రతిరోజూ లైట్ అండ్ షో నిర్వహించి విజయనగరం చరిత్ర, వైభవాన్ని సాయంత్రం వేళల్లో లేజర్ షో ద్వారా ప్రదర్శించేందుకు శాశ్వత ఏర్పాట్లు చేయాలని సూచించారు. దక్షిణంవైపు కోట సుందరీకరణలో భాగంగా ఆ ప్రాంతంలో నివాసం వుంటున్న 16 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. సోనియానగర్ లో వున్న టిడ్కో ఇళ్లను వారికి కేటాయించాలని సూచించారు. వారంలోగా వారంతా అక్కడికి తరలివెళ్లేలా ఏర్పాట్లు చేయాలన్నారు. పర్యటనలో ఆర్‌డిఒ దాట్ల కీర్తి, సిపిఒ పి.బాలాజీ, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, మాన్సాస్ ఇఒ కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్, తహశీల్దార్ కూర్మనాథరావు, పూసపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు 12 వేదికలు సిద్ధం

అక్టోబర్ 13, 14 తేదీలలో నిర్వహించనున్న విజయనగరం ఉత్సవాలను నగరం లోని 12 ప్రధాన వేదికల వద్ద పలు వినోద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ బిఆర్.అంబేద్కర్ తెలిపారు. 12 వేదికల వద్ద జిల్లా అధికారులను ఇంచార్జ్ లుగా నియమించి , కార్యక్రమాల పట్ల వారి ఆశక్తికి తగ్గట్టుగా సుమారు 50 మంది లైఫ్ మెంబెర్లను ప్రతి వేదిక వద్ద సర్దుబాటు చేసినట్లు తెలిపారు. లైఫ్ మెంబర్ల సలహాలు సూచనలతో అధికారులు కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఉత్సవాల నిర్వహణలో అందరినీ భాగస్వాములను చేయాలని సూచించారు.

మున్సిపల్ కార్మికులందరికీ బేసిక్ వేతనమివ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం కార్పొరేషన్‌లో పిహెచ్ కార్మికులందరికీ బేసిక్ వేతనం రూ.21వేలు, టెక్నికల్ వేతనం రూ.2400 ఇవ్వాలని కోరుతూ సోమవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కమిషనర్ నల్లనయ్యకు వినతి పత్రం ఇచ్చారు. కమిషనర్ స్పందిస్తూ టెండర్లు పొందుపరిచిన విధంగా జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని, జీతాలు బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో యూనియన్ అధ్యక్షులు ఎ.జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షులు మురళి, నారాయణరావు, అరుణ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు వినతులు

నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐదు వినతుందాయి. అర్జీలను కమిషనర్ పి.నల్లనయ్య స్వీకరించారు. కార్యక్రమంలో ఇఇ కె.శ్రీనివాసరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి, మేనేజర్ ప్రసాద రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం

ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులందరూ ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సూచించారు. సోమవారం నుంచి ఓటు నమోదు ప్రక్రియ ప్రారంభమయ్యిందని నవంబర్ 6 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. నవంబర్ 23వ తేదీన డిసెంబర్ 30న తేదీన డ్రాఫ్ట్ పబ్లిష్ అవుతుందని, 23 నుంచి డిసెంబర్ 09వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని చెప్పారు. అన్ని పరిశీలన అనంతరం డిసెంబర్ 30వ తేదీన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన తుది ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుందని వివరించారు. జిల్లా కలెక్టరేట్ మీటింగు హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఆయన వివిధ అంశాలపై సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ఓటర్ల జాబితా నమోదు, ఇతర ప్రక్రియలపై చర్చించారు. ఎన్నికలో భాగంగా ఓటు నమోదు చేసుకునేందుకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు సెకండరీ స్థాయికి (ఆరో తరగతికి పైబడి) మించిన పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో పని చేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు కూడా అర్హులేనని చెప్పారు.

టీచర్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్ ప్రకటన

విజయనగరంకోట : టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం నేడు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కలెక్టర్ తెలిపారు. నవంబరు 6వ తేదీ వరకు ఓటర్ల జాబితాలో పేర్ల నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా ఎనిమిది కేంద్రాల మార్పునకు ప్రతిపాదిస్తున్నట్లు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చెప్పారు. గజపతినగరంలో తమటాడ, కొత్తవలస మండలం మంగళపాలెంలో 3 కేంద్రాలు, వేపాడ మండలం డబ్బిరాజుపేటలో ఒకటి, రాజాం అసెంబ్లీ పరిధిలో వంగర మండలం లక్ష్మీపేట తదితర ఎనిమిది కేంద్రాల మార్పునకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. జిల్లాలో ఇంకా ఏవైనా కేంద్రాలు మార్పునకు రాజకీయ పార్టీలు ప్రతిపాదిస్తే వాటిని పరిశీలిస్తామని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన రాజకీయ పార్టీల సమావేశంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై చర్చించారు. నవంబరు 9, 19, 23, 29 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు దినాలుగా గుర్తించి ఆరోజుల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, డిఆర్ఓ ఎస్.డి.అనిత, ఆర్‌డిఒలు ఎ.సాయిశ్రీ, దాట్ల కీర్తి, ఎస్‌డిసిలు మురళీకృష్ణ, జోసెఫ్, నూకరాజు, ప్రమీల తదితరులు, పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని భర్త ఇంటి ముందు ధర్నా చేస్తున్న పరమేశ్వరి

భర్త ఇంటి ముందు భార్య ధర్నా

శృంగవరపుకోట : భర్త మోసం చేశాడని హైదరాబాదుకు చెందిన పరమేశ్వరి అనే మహిళ మండలంలోని పోతనపల్లి గ్రామంలో తన భర్త ఇంటి ముందు సోమవారం ధర్నా నిర్వహించింది. ఈ విషయమై బాధితురాలి కథనం ప్రకారం.. మండలంలోని పోతనపల్లి గ్రామానికి చెందిన పూడి సుధాకర్ హైదరాబాదులో సిసిఎస్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తూ 2014లో పరమేశ్వరిని యాదగిరిగుట్టలో పెళ్లి చేసుకున్నాడు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో సుధాకర్ తండ్రి చనిపోయాడని చెప్పడంతో ఆమె వస్తానని చెప్పినా ఆయన రానివ్వలేదు. పోతనపల్లి గ్రామానికి వచ్చిన సుధాకర్ మరో పెళ్లి చేసుకుని తనను మోసం చేశాడని, తనకు న్యాయం చేయాలని పరమేశ్వరి డిమాండ్ చేసింది.

తాజుద్దీన్ బాబా ఆశ్రమంలో కర్రోతు

భోగాపురం : తాజుద్దీన్ బాబా ఆశ్రమంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. మార్క్ ఫెడ్ చైర్మన్ పదవి వచ్చిన సందర్భంగా మొదటిసారి సమీపంలో ఉన్న ఆశ్రమాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసినట్లు ఆయన తెలిపారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

డెంకాడ : మండలంలోని చొల్లంగిపేట మాజీ సర్పంచ్ తొత్తడి శ్రీనివాసరావు కుటుంబాన్ని నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సోమవారం పరామర్శించారు. శ్రీనివాసరావు మాతృమూర్తి తొత్తడి చంద్రమ్మ (70) అనారోగ్యంతో ఇటీవల మరణించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ వారి కుటుంబాన్ని పరామర్శించి చనిపోవడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించి తన సానుభూతిని తెలియజేశారు. ఆయనతో పాటు సర్పంచులు కోరాడ కనకరాజు, అట్టాడ శివకృష్ణ, లెంక లక్ష్మణరావు, వైసిపి మండల యువజన నాయకులు కరుమజ్జి త్రినాథరావు, నాయకులు సారిక గౌరీ, నాగేశ్వరరావు, సురేష్, రెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుత క్షణంపై యువత దృష్టి పెట్టాలి

డెంకాడ : యువతీ యువకులు, విద్యార్థులు గతం గురించి చింతించకుండా, భవిష్యత్తు గురించి ఆలోచించకుండా, ప్రస్తుత క్షణం పై దృష్టి పెట్టాలని అడవి కొలను వెంకట్ కోరారు. మండలంలోని లెండి ఇంజనీరింగ్ కాలేజీలో 'భవిష్యత్తులో బాధ్యతలను స్వీకరించడం, అవరోధాలను అధిగమించడం ఎలా' అనే అంశంపై సెమినార్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యాలను సాధించడంలో స్వాట్ విశ్లేషణ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. సంభావ్య ఆపదలను గుర్తించడం ద్వారా విద్యార్థులు సవాళ్లను ముందుగానే ఊహించి సన్నద్ధం కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఈ మధుసూదన్ రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తమ్మినేని హరిబాబు, సైన్స్ అండ్ హ్యూమనీటిస్ విభాగాధిపతి డాక్టర్ పి. దుర్గా శైలజ పాల్గొన్నారు.

పాఠశాల స్వీపర్‌ను కొనసాగించాలని వినతి

గజపతినగరం : మండలంలోని రామన్నపేట పాఠశాల పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్ వెలగాడ జానకిని కొనసాగించాలని సోమవారం స్థానిక ఎంఇఒ కార్యాలయంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి ఆధ్వర్యాన వినతి అందించారు. ఈ సందర్భంగా వి.లక్ష్మి మాట్లాడుతూ స్వీపర్ పాఠశాలకు వెళ్లి పనిచేస్తున్నా రాజకీయ వేధింపుల కారణంగా హెచ్‌ఎం హాజరు వేయడం లేదని తెలిపారు. ఆ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులంతా వెలగాడ జానకిని కొనసాగించాలని సంతకాలు పెట్టి ఇచ్చిన మెమోరాండానికి కూడా ఎంఇఒకు అందజేసినట్లు చెప్పారు. జానకిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. బాధిత స్వీపర్ వెలగాడ జానకి, పి.పైడిరాజు, ఎ.గౌరి పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడు వెంకటరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

వెంకటరావుకు ఘన సన్మానం

కొత్తవలస : మండలంలోని చినమన్నిపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులు కోన వెంకటరావు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యాన వెంకటరావు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు సిహెచ్ నిర్మలదేవి, జిల్లా నాయకులు జి.వెంకట నాయుడు, ఎస్‌ఎంసి చైర్‌పర్సన్ బొబ్బాది నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

భూముల ఆక్రమణపై ఫిర్యాదు

శృంగవరపుకోట : మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ అరుణకుమారికి జనసేన నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. పుణ్యగిరి రోడ్డులో జగనన్న కాలనీకి ఆనుకొని సర్వే నంబర్ 168-1లో ఖరీదైన స్థలం కబ్జాకు గురైందని తెలిపారు. దీనిపై గతంలో పత్రికా కథనాలు వచ్చినప్పటికి అధికారులు స్పందించని కారణంగా ఈ స్థలంలో మరికొందరు ఆక్రమించడానికి ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. అరకు-విశాఖ రోడ్డు కాలేజీ గోడను ఆనుకుని సర్వే నెంబర్ 471లో రేకులు షెడ్ నిర్మించారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పి.సురేష్ రాజు, తాండ్రంగి చంటి, మోపాడ చిన్ని, గంధవరపు సతీష్, దొగ్గ రమణ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష

తెర్లాం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్లతో ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ సమీక్షించారు. అసంపూర్తిగా ఉన్న పనులను గుర్తించడం, గ్రామసభల్లో చర్చించాల్సిన అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎపిఒ సుశీల, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ఘనసత్కారం

భోగాపురం : మండలంలోని ఎ.రావివలస పంచాయతీ అమటాం ఉన్నత పాఠశాలకు చెందిన ముని రాము అనే ఉపాధ్యాయుడు ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా గ్రామ సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు గురించి పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వర్ణ, యుటిఎఫ్ యూనియన్ నాయకులు పడాల చంద్రశేఖర్, ఆళ్ల వైకుంఠ రావు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు నేషనల్ స్కూల్ విద్యార్థులు

విజయనగరంటౌన్ : నగరంలోని విటి అగ్రహారంలో జరిగిన జిల్లా స్థాయి సెపక్ తక్రా పోటీల్లో నేషనల్ స్కూలు విద్యార్థులు ఎం.విద్యశ్రీ, ఆర్.విజయ్‌కుమార్ (అండర్ 19) విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్ 1,2 తేదీల్లో పల్నాడుజిల్లా సత్తెనపల్లి మండలం పెదమక్కువలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూలు కరస్పాండెంట్ బి.రామారావు, స్కూలు ఇన్‌ఛార్జి దీపక్, పిఇటి శ్రీనివాస్ అభినందించారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఇఒ

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు, వావిలపాడు, సోంపురం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సోమవారం ఎంఇఒలు జి.జగదీశ్వరరావు, పి.బాలభాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాన్ని, వర్క్‌బుక్స్, నోట్‌బుక్, రికార్డులు, పాఠశాల ఆవరణను పరిశీలించారు. విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీలో నెలకొన్న సమస్యలను వార్డు కౌన్సిలర్లు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి దృష్టికి తీసుకు వెళ్ళారు. ముఖ్యంగా ఇళ్లు లేని 1400 మంది పేదలకు ఇళ్ల స్థలాలు కొండ ప్రాంతంలో కేటాయించడం వల్ల లబ్ధిదార్లు ఆ ప్రాంతంలో ఎటువంటి సౌకర్యాలు లేక పోవడంతో అక్కడికి వెళ్లడానికి ఇష్టపడలేదని వేరే ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఇటీవల మృతి చెందిన పారిశుధ్య కార్మికుడికి ప్రభుత్వం తరపున న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర పంచాయతీలో జరుగుతున్న పరిణామాలు తన దృష్టికి వచ్చాయని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కొండవెలగాడ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులను కోచ్ చల్లా రాము ఆధ్వర్యంలో అభినందించి రూ.50వేలు నగదు ప్రోత్సాహక చెక్‌ను అందజేశారు. రామతీర్థం జంక్షన్‌లో మెప్మా సూపర్ బజార్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మన్‌లు సముద్రపు రామారావు, కారు కొండ కృష్ణ, కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, లెంక హైమావతి, మైపాడ ప్రసాద్, పాండ్రాంకి సత్యవతి, మొయిద శ్రీనివాసరావు, కమిషనర్ కె. అప్పలరాజు, మెప్మా సిఎంఎం డి. గోవిందరావు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన ఎంపిపి, వైస్ ఎంపిపి

డెంకాడ : స్థానిక ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, వైస్ ఎంపిపి కూరాకుల అనిత సోమవారం ఎమ్మెల్యే లోకం నాగ మాధవి సమక్షంలో జనసేనపార్టీలో చేరారు. వైసిపిలో ఉన్న వీరితోపాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు కూడా జనసేనలో చేరారు. ఇటీవల ప్రజాశక్తిలో ఎంపిపి పార్టీ మారుతున్నట్లు కథనం ప్రచురితమైన విషయం విధితమే. ఈనేపథ్యంలో వారు జనసేనలో చేరడంతో మండలంలో చర్చనీయాంశమైంది.

స్వర్ణాంధ్ర ప్రదేశ్‌కు కృషి చేయాలి

ప్రజాశక్తి- డెంకాడ

2047 ఆంధ్రప్రదేశ్ కోసం ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2047 స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం యాక్షన్ ప్లాన్ తయారు చేయడం కోసం సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్ణాంధ్రప్రదేశ్ కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అందుకు అధికారులు ప్రజాప్రతినిధులు యాక్షన్ ప్లాన్ తయారుచేసి అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ప్రజాప్రతినిధులు అధికారులకు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. విజన్ 2047 కోసం ప్రయత్నాలు మొదలు పెట్టాలన్నారు. అనంతరం గ్రామ సభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, డిప్యూటీ తహశీల్దార్ సూర్యకాంతం, జనసేన నాయకులు పైల శంకర్, మహంతి శివ, వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రోగుల సందర్శకులకు భోజనం పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కంటోన్మెంట్ థెరిసా క్లబ్ నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు, సామాజిక సేవలు ప్రశంసనీయమని సమాచార పౌరసంబంధాల శాఖ ఎవి సూపరువైజరు డి.సత్యనారాయణరావు, సమాచార శాఖ ఉద్యోగి చిప్పాడ ప్రభుదాస్ అన్నారు. జిల్లా కేంద్రాసుపత్రి వద్ద రోగుల వద్దకు వచ్చిన సందర్శకులకు భోజనాలు పంపిణీ చేశారు. థెరిసా క్లబ్ ఆనందం కార్యక్రమంలో సోమవారం వీరు పాల్గొన్నారు. ముందుగా మదర్ థెరిస్సా విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ తన 52వ పుట్టిన రోజు సందర్భంగా జిల్లా కేంద్ర ఆసుపత్రి వద్ద రోగుల సందర్శకులకు ఆనందం కార్యక్రమం ద్వారా భోజనం పంపిణీ చేయడం ఆనందం కలిగించిందన్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

నగరంలో మహిళా గర్జన

ప్రజాశక్తి-విజయనగరంకోట

మహిళలపై రోజురోజుకూ పెరుగుతున్న అకృత్యాలను అరికట్టాలని, మహిళా చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరుతూ వాజీ ఛానల్, పలు స్వచ్ఛందసంస్థలు, మహిళా సంఘాల ఆధ్వర్యాన మహిళలు సోమవారం నగరంలో మహిళా గర్జన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోట వద్ద ఈ ర్యాలీని వాజీ ఛానల్ ఎమ్‌డి జి.శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం అక్కడి నుంచి గురజాడ జంక్షన్ మీదుగా పైడితల్లమ్మ ఆలయం, మూడు లాంతర్లు, గంట స్తంభం, మహారాజా కాలేజ్ మీదుగా గురజాడ సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి, వాజీ ఛానల్ ఎమ్‌డి జి.శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ గవర్నర్ డాక్టర్.ఎం. వెంకటేశ్వరరావు, పలు మహిళా సంఘాల నాయకులు మాట్లాడారు. కుటుంబాల్లో స్త్రీ, పురుషుల మధ్య బేధం లేకుండా చూడాలన్నారు ప్రభుత్వాలు మహిళలకు ఏం జరిగినా వెంటనే స్పందించే విధంగా ప్రతి చోట నెంబర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, జన విజ్ఞాన వేదిక, మేమున్నాం స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కాపుగంటి ప్రకాష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ జి.హిమబిందు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు అచ్చిరెడ్డి, స్వచ్ఛంద సంస్థల సభ్యులు సూర్య లక్ష్మి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఇళ్ల స్థలాల ఆక్రమణలపై వాగ్వివాదం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాల ఆక్రమణలపై మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి, వైసిపి కౌన్సిలర్ ఇంటి గోవింద్ మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో సోమవారం చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఇంటి గోవింద్ మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలు ఆక్రమణలపై ధర్నా చేస్తామని గతంలో ప్రకటించి ఎందుకు చేయలేదని వైస్ చైర్మన్ చెలికాని మురళీని ప్రశ్నించగా ఇద్దరు మధ్య వాగ్వివాదం జరిగింది. ఇందిరమ్మ కాలనీలో ఎన్ని స్థలాలు వేశారు, ఎంతమందికి పట్టాలు ఇచ్చారు, ఖాళీగా ఉన్న స్థలాల వివరాలు ఇవ్వాలని వైస్ చైర్మన్ చెలికాని మురళి కోరగా, టౌన్ ప్లానింగ్ అధికారి చేరిన వెంటనే ఇస్తామని కమిషనర్ రామలక్ష్మి చెప్పారు. మున్సిపాలిటీలో చెరువుల ఆక్రమణకు గురవుతున్నాయని, ఎన్ని చెరువులు ఉన్నాయో చెప్పాలని వైస్ చైర్మన్ కోరారు. టిడిపి కౌన్సిలర్ రాంబార్కి శరత్ మాట్లాడుతూ పూల్‌బాగ్ రోడ్డు బాగు చేసేందుకు రూ.40లక్షలు ఖర్చు చేసినా, ఎక్కడ గోతులు అక్కడే ఉన్నాయన్నారు. పనుల్లో నాణ్యత లేదని ఆరోపించారు. పూల్‌బాగ్ రోడ్డు బాగు చేయాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులకు కౌన్సిల్లో తీర్మానించారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ గల ఉద్యోగి కృష్ణమూర్తి

సన్మానసభలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

జెడ్‌పి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కచ్చాల కృష్ణమూర్తి క్రమశిక్షణ గల ఉద్యోగి అని, ఆర్థిక క్రమశిక్షణతో పేరు తెచ్చుకున్నారని జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిప్యూటీసిఇఒ కె.రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం కృష్ణమూర్తి ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కృష్ణ మూర్తి, సత్య కృష్ణ వేణి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తిని ఆదా చేయడంలో ఉద్యోగులకు మార్గదర్శి కృష్ణమూర్తి అని అన్నారు. పంచాయితీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘ అధ్యక్షులు ఆర్.వి.రమణమూర్తి మాట్లాడుతూ ఇంటి పేరును అందరికీ తెలిసే విధంగా ఉద్యోగం నిర్వహించారన్నారు. గరివిడి జెడ్‌పిటిసి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇలాంటి అధికారులు వలన ప్రభుత్వానికి పేరు వస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసులు నాయుడు మాట్లాడుతూ ఒక పట్టుదల కలిగిన వ్యక్తి అన్నారు. సెట్విజ్ సిఇఒ మాట్లాడుతూ ఊరు రుణం తీర్చు కున్న వ్యక్తి, సామాజిక సేవలో ముందుంటరన్నారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశీస్సుల వల్లే ఈ స్థాయికి ఎదిగానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తి దంపతులను సత్కరిస్తున్న అధికారులు, ఉద్యోగులు

నీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో తాగునీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలని ఇంజినీరింగ్ సిబ్బందికి, ఎమినిటీస్ కార్యదర్శులకు కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశించారు. సోమవారం నగరంలో ఉన్న పలు వాటర్ ట్యాంకులను శుభ్రపరిచే కార్యక్రమాన్ని సిబ్బంది చేపట్టారు. బాబా మెట్ట, జమ్ము, పూల్ బాగ్, కొత్తపేట వాటర్ ట్యాంకులు రెండింటిని, పరిశుభ్రపరిచారు. నెలలో కనీసం ఒకసారి గాని, రెండుసార్లు గాని వాటర్ ట్యాంకులు శుభ్ర పరచాలని కమిషనర్ ఇదివరకే సిబ్బందికి ఆదేశించారు. తరుచూ నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని చెప్పారు.

బొటానికల్ గార్డెన్‌ను వినియోగంలోకి తేవాలి

దక్షిణ భారతదేశంలో తొలి బొటానికల్ గార్డెన్ గా పేరొందిన రాణి అప్పలకొండయాంబ రాక్ గార్డెన్ ను రెండు రోజుల్లో పరిశుభ్రపరిచి ఆహ్లాదకర వాతావరణంగా తీర్చిదిద్దాలని సిబ్బందికి కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశించారు. లేదంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం ఉదయం రాక్ గార్డెన్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, రవిశేఖర్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయనగరం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు, విజయనగరం
IA 606/2023 in OS: 64/2022

Between :
నడిమింటి నారాయణరావు ......Petitioner/Plaintiff
And :
టాటా దేవదత్ మరియు వగైరాలు...Respondent/Defendants
To
R1. టాటా దేవదత్, S/o. T.V. రమణమూర్తి, వయస్సు 45 సంII, R/o రాజిని జిల్లా, 10th క్రాస్ రోడ్డు, చేంచూర్, ముంబాయ్-400071.
R2. బోంతా విజయలక్ష్మి, W/o. లేటు లక్ష్మి నారాయణ, వయస్సు 69 సంII, R/o M.G. రోడ్డు, ప్లాట్ నెం.32, బెంగుళూర్, ప్రస్తుతం నివాశం C/o బోంత దీప్తి, 518, SD 6, 3rd A Main, శాంతిదామ్, OMBR తేజేంట్, Opp. నక్షత్ర బిల్డింగ్స్, బన్సువాడి, బెంగుళూర్-560043
R3. నడిమింటి ప్రకాశ్‌రావు, S/o. లేటు సూర్య నారాయణ, వయస్సు 78 సంII, R/o Door No. 26-1-65, నడిమింటి వారి వీధి, దాసన్నపేట, విజయనగరం.
R4. నడిమింటి చంద్రశేఖర్ రావు, S/o. లేటు సూర్య నారాయణ, వయస్సు 63 సంII, R/o Door No. 26-1-65, నడిమింటి వారి వీధి, దాసన్నపేట, విజయనగరం.
R5. గోడా వెంకటరమణ, W/o. లేటు వెంకటగోపాల కృష్ణమూర్తి, వయస్సు 75 సంII, R/o do-
R6. నడిమింటి లలిత, D/o. లేటు సూర్య నారాయణ, వయస్సు 68 సంII, R/o do-

పై నెంబరు కోర్టునందు వాది దావా నమోదు చేయ్యగా శ్రీ కోర్టువారు వాదిని ఆర్డరు జారీ చేసిన విధంగా ఈ నోటీసు పంపించడం జరిగినది. ఈ దావా **తేది 15/10/2024 ఉదయం 10:30 ని॥**లకు మీరు గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టునకు హాజరై మీ వాదనను తెలియజేయవలెను. లేని ఎడల శ్రీ కోర్టువారు మీకు పరోక్షంగా తీర్మానిచుదురు అని యిందుమూలంగా తెలియజేయడమైనది.

A.L.NARAYANA
Advocate, Vizianagaram
Cell: 9110529193

మహారాజశ్రీ విజయనగరం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు, విజయనగరం
IA:575/2022 in OS: 64/2022

Between :
నడిమింటి నారాయణరావు ......Petitioner/Plaintiff
And :
టాటా దేవదత్ మరియు వగైరాలు...Respondent/Defendants
To
R1. టాటా దేవదత్, S/o. T.V. రమణమూర్తి, వయస్సు 45 సంII, R/o రాజిని జిల్లా, 10th క్రాస్ రోడ్డు, చేంచూర్, ముంబాయ్-400071.
R2. బోంతా విజయలక్ష్మి, W/o. లేటు లక్ష్మి నారాయణ, వయస్సు 69 సంII, R/o M.G. రోడ్డు, ప్లాట్ నెం.32, బెంగుళూర్, ప్రస్తుతం నివాశం C/o బోంత దీప్తి, 518, SD 6, 3rd A Main, శాంతిదామ్, OMBR తేజేంట్, Opp. నక్షత్ర బిల్డింగ్స్, బన్సువాడి, బెంగుళూర్-560043
R3. నడిమింటి ప్రకాశ్‌రావు, S/o. లేటు సూర్య నారాయణ, వయస్సు 78 సంII, R/o Door No. 26-1-65, నడిమింటి వారి వీధి, దాసన్నపేట, విజయనగరం.
R4. నడిమింటి చంద్రశేఖర్ రావు, S/o. లేటు సూర్య నారాయణ, వయస్సు 63 సంII, R/o Door No. 26-1-65, నడిమింటి వారి వీధి, దాసన్నపేట, విజయనగరం.
R5. గోడా వెంకటరమణ, W/o. లేటు వెంకటగోపాల కృష్ణమూర్తి, వయస్సు 75 సంII, R/o do-
R6. నడిమింటి లలిత, D/o. లేటు సూర్య నారాయణ, వయస్సు 68 సంII, R/o do-

పై నెంబరు కోర్టునందు వాది దావా నమోదు చేయ్యగా శ్రీ కోర్టువారు వాదిని ఆర్డరు జారీ చేసిన విధంగా ఈ నోటీసు పంపించడం జరిగినది. ఈ దావా **తేది 15/10/2024 ఉదయం 10:30 ని॥**లకు మీరు గాని, మీ న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టునకు హాజరై మీ వాదనను తెలియజేయవలెను. లేని ఎడల శ్రీ కోర్టువారు మీకు పరోక్షంగా తీర్మానిచుదురు అని యిందుమూలంగా తెలియజేయడమైనది.

A.L.NARAYANA
Advocate, Vizianagaram
Cell: 9110529193

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని ఎస్‌ఎస్‌ఆర్ పేట జంక్షన్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం నెల్లిమర్లకు చెందిన సింగిరోతు శ్యామ్‌కుమార్(40) స్కూటీపై రాజాం నుంచి నెల్లిమర్ల వస్తున్న క్రమంలో విజయనగరం నుంచి చీపురుపల్లి వైపు వెళ్తున్న కారు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మృతుని భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుర్ల పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడుని చూసి కన్నీరు మున్నీరయ్యారు.

స్తంభాన్ని ఢీకొన్న కాలేజీ బస్సు

స్వల్ప గాయాలతో బయటపడిన విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

లెండీ ఇంజినీరింగ్ కళాశాల నుంచి సోమవారం విద్యార్థులను తీసుకొని వస్తున్న బస్సు నగరంలోన సిఎంఆర్ జంక్షన్‌లో సిసి కెమెరాల స్తంభాన్ని ఢీకొంది. సిఎంఆర్ షాపింగ్ మాల్ జంక్షన్‌కు వచ్చేసరికి బస్సు డ్రైవర్‌కు ఒకసారిగా ఫిట్స్ రావడంతో పక్కనే ఉన్న సిసి కెమెరాల స్తంభాన్ని ఢీకొట్టడంతో బస్సు అద్దాలు పగిలాయి. డ్రైవర్‌కు గాయాలు కావడంతో స్థానికులు విద్యార్థులు స్పందించి వెంటనే నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులకు స్వల్పగాయాలు అయ్యాయి. ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

బైక్, ట్రాన్స్‌ఫార్మర్లు మాయం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని అక్కివరంలో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్, డి. తాళ్లవలస గ్రామంలో మోటార్ సైకిల్ (ఎన్‌ఫీల్డ్)ను ఆదివారం రాత్రి దొంగలు మాయం చేశారు. డి తాళ్లవలసకు చెందిన అట్టాడ శ్రీనివాసరావు ఆదివారం రాత్రి తన ఇంటి ముందు బండిని పార్క్ చేసి తాళం కూడా వేశాడు. సోమవారం ఉదయం 6 గంటలకు లేచి చూసేసరికి తన బైక్ కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నాడు. అక్కివరంలో మూడు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు పట్టుకుపోయారు. వీటిపై రైతులు ఇంకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. మూడు నెలల క్రితం ఈ మండలంలో వివిధ గ్రామాల్లో సుమారు 15 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగలు పట్టుకుపోయారు. వీటిపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

వేపాడ : మండలంలోని సోంపురం గ్రామంలో మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ దేవి తెలిపారు. 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

25 మద్యం సీసాలు స్వాధీనం

గజపతినగరం : గజపతినగరం బ్రిడ్జి సమీపంలో పోలీసులు సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో గజపతినగరానికి చెందిన పసుమర్తి అప్పలరాజు 25 మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు. ఇంతకుముందు నాలుగు కేసులు ఆయనపై ఉండటంతో రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు.

పబ్లిక్ నోటీసు

[illegible] 14-09-1999 [illegible] 13-07-2010 [illegible] 127-5 [illegible] 27-10-2010 [illegible] 4 1/2 [illegible]

[illegible]

శ్రీకాకుళం జిల్లా (ప్రస్తుతం విజయనగరం జిల్లా) [illegible] 127-5 [illegible] 0.15 సెంట్లుకు [illegible]

[illegible]
ఉత్తరం : పంచాయతీ రోడ్డు.

[illegible]
అడ్వకేట్, శ్రీకాకుళం